క్రీడలకు ప్రోత్సాహమేది?

- పాఠశాలల్లో మైదానాలు కరువు
- పిల్లల క్రీడా వికాసానికి విఘాతం
- క్రీడల అభివృద్ధిపై దృష్టి సారించని అధికారులు, పాలకులు
- నేడు జాతీయ క్రీడాదినోత్సవం


ఆటలు ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

గద్వాల: పిల్లల సమగ్ర వికాసానికి భాష, శాస్త్రాలతోపాటు వ్యాయామ విద్య కీలకం. ఆటలతో శారీరక చురుకుదనం అలవడటమే కాకుండా సమర్థంగా నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలు వస్తాయి. దురదృష్టవశాత్తు చదువు, క్రీడలను సమన్వయం చేసే వ్యవస్థలు నిర్వీర్యమవుతూ వస్తుండడంతో క్రీడారంగం అప్రాధాన్యంగా మారింది. బడుల్లో అరు సబ్జెక్టులకు ఇచ్చిన ప్రాధాన్యం.. వ్యాయామ విద్యకు ఇవ్వడంలేదు. ఆ దిశగా ప్రభుత్వాలు కూడా వసతులు కల్పించడంలేదు. దీంతోపాటు క్షేత్రస్థాయిలో అడ్డొస్తున్న రాజకీయాలు, నిర్వహణ లోపాలతో ఆటల్లో వెనకబడిపోతున్నాం. మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో క్రీడల పరిస్థితిపై విశ్లేషణ.

నానాటికీ తీసికట్టుగా..

క్రీడల నిర్వహణలో గద్వాలకు ఘనమైన చరిత్ర ఉంది. వివిధ పోటీల్లో పాల్గొనడానికి చాలామంది జాతీయ క్రీడాకారులు గద్వాలకు వచ్చి క్రీడలు ఆడారు. ఎన్నో రాష్ట్రస్థాయి పోటీలకు వేదికగా నిలిచిన ఖ్యాతి ఉంది. ఇలాంటి పట్టణంలో క్రీడలు మరింత అభివృద్ధి చెందాల్సిందిపోయి నానాటికీ తీసికట్టుగా తయారయ్యాయి. మౌలిక సదుపాయాల ఏర్పాటును అటు పాలకులు, ఇటు అధికారులు మరిచారు. క్రీడా క్యాలెండర్‌ను పాటించిన పాపాన పోలేదు. ప్రస్తుతం క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ జిల్లా కేంద్రాలకే పరిమితం కావడం, అవి మొక్కుబడిగా మారడంతో క్రీడాకారులకు ప్రతిభ ఉన్నా వెళ్లలేని దుస్థితి నెలకొంది.

క్రికెట్, ఫుట్‌బాల్‌లో అదరహో..

ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి తగిన వాతావరణం కల్పించిన ఘనత గద్వాలకు దక్కుతోంది. పట్టణంలో అరు దశాబ్దాల క్రితమే ఫుట్‌బాల్ క్రీడను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు క్రమం తప్పకుండా అసోసియేషన్ సభ్యులు పోటీలను నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ ప్రాంతానికి చెందిన దొరస్వామి, నబ్వి వంటి క్రీడాకారులు అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం అసోసియేషన్‌కు చెందిన సభ్యులే ఫుట్‌బాల్ క్రీడను భుజాన వేసుకొని ప్రోత్సహిస్తున్నారు. క్రీడాకారులకు అండగా నిలుస్తున్నారు. ఫుట్‌బాల్ అంటే గద్వాలనే విధంగా ఉమ్మడి జిల్లాలో మార్మోగుతోంది. దీంతోపాటు గత కొన్నేళ్లుగా క్రికెట్‌లో సైతం గద్వాల క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. ప్రతి సంవత్సరం నలుగురు లేదా ఐదుగురు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులు, యువకులు క్రికెట్ పట్ల ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తైక్వాండో పోటీల్లో సైతం క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. రెండు, మూడేళ్లుగా కొంతమంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఫుట్‌బాల్, క్రికెట్, తైక్వాండో కరాటే కున్న క్రేజీ గద్వాలలో మరే క్రీడకు లేదు. కబడ్డీ, వాలీబాల్, షటిల్ సీనియర్ క్రీడాకారులు క్రీడలను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా యువతకు తర్ఫీదు ఇస్తున్నారు.

కానరాని మైదానాలు..

క్రీడలకు పునాదిగా భావించే పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మైదానాల కొరత ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో తాతల కాలం నాడు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో అరకొర వసతుల మధ్య ఆటల సందడినే మరిచారు. కొత్త భవనాలు నిర్మిస్తున్నారే తప్ప మైదానాలను విస్మరిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో చిత్తశుద్ధి కనిపించడంలేదు. దీంతో విద్యార్థులకు ఆటలు అందని ద్రాక్షగానే మారాయి. ఇక ప్రైవేటు పాఠశాలల పరిస్థితి మరీ దారుణం. బహుళంతస్తుల్లో పాఠశాలలు నిర్వహిస్తూ పిల్లల క్రీడా వికాసానికి విఘాతం కల్గిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని నల్లసోమనాద్రి స్టేడియం చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఒక్కటే జిల్లాకు తలమానికంగా నిలిచింది. అదీ కూడా పూర్తిస్థాయి హంగులకు నోచుకోలేదు. స్టేడియంలో అరకొర వసతులు ఉండటం వల్ల అన్ని క్రీడలు ఆడలేని పరిస్థితి ఉంది.



పూర్తిస్థాయి హంగులకు నోచుకోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

ప్రోత్సాహం అవసరం..



ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు క్రీడలపై శిక్షణ తరగతులు ఉండాలి. ప్రతి పాఠశాలకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలి. క్లబ్‌లు, అసోసియేషన్లు కూడా క్రీడాకారులను దత్తత తీసుకోవాలి. ప్రజాదరణ కలిగిన క్రీడలకు ఆయా ప్రాంతాల్లో అకాడమీలను స్థాపిస్తే కొత్త క్రీడాకారులు వెలుగులోకి వస్తారు.

– శ్రీహరి, కరాటే మాస్టర్, గద్వాల

ఉన్నత విద్యకు సాయం కావాలి..



క్రీడా ప్రాతిపదికన విద్యను పూర్తిచేసే విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం ఎలాంటి సహాయం అందించడంలేదు. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే ప్రభుత్వం వారి చదువులకు భరోసా ఇవ్వాల్సి ఉంది. గ్రామీణ స్థాయిలో ఎందరో ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారు. వారికి సరైన మార్గదర్శి లేక వెలుగులోకి రావడంలేదు.

– శ్రీనివాసులు, క్రికెట్ కోచ్, గద్వాల

క్రీడలను బలోపేతం చేస్తాం..



పాఠశాలస్థాయిలో క్రీడలను బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టాం. క్రీడా బడ్జెట్‌తోపాటు మైదానాల్లో అన్ని వసతులు కల్పించడానికి ప్రతిపాదనలు రూపొందించాం. వేసవి శిక్షణా శిబిరాల సామర్థ్యాన్ని మరింత పెంచడానికి కృషి చేస్తాం. ప్రతిభావంతులకు ప్రభుత్వ సహకారంతో ప్రోత్సాహం అందిస్తాం.

– బీఎస్ ఆనంద్, డీవైఎస్‌ఓ, గద్వాల

వర్షాల కోసం ప్రత్యేక పూజలు


మానవపాడులో తుంగభద్ర నది నుంచి నీటిని తీసుకొస్తున్న గ్రామస్తులు


ఇటిక్యాలపాడులో..


ఉండవెల్లి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మానవపాడు: మండల కేంద్రంలో వర్షాల కోసం సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. 11మంది ఉపవాస దీక్ష చేపట్టి తుంగభద్ర నది నుంచి నీటిని తీసుకొచ్చారు. అనంతరం శివాలయంలో, గ్రామదేవతలకు అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా ముస్లింలు స్థానిక జామియా మసీదు నుంచి వ్యవసాయ పొలానికి ఊరేగింపుగా చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మౌలానా ముక్రం, మునలి మహబూబ్ పాషా పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంతోపాటు ఇటిక్యాలపాడులో వర్షాల కోసం ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి నీటిని తీసుకొచ్చి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో అభిషేకాలు..

ఎర్రవల్లిచౌరస్తా: శ్రావణ సోమవారం సందర్భంగా బీచుపల్లి క్షేత్రంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ సోమవారం సందర్భంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అర్చకుడు గౌరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ముని్సిపల్ చైర్మన్‌కు వినతి

గద్వాల: మున్సిపాలిటీలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సోమవారం ఆ సంఘం నాయకులు మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, కమిషనర్ నర్సింహకు వినతిపత్రాలు అందజేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

అలంపూర్ రూరల్: పట్టణంలోని ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోవిందరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రికార్డుల పరిశీలన

మానవపాడు: మండలంలోని అమరవాయి, కలుకుంట్ల, చంద్రశేఖర్‌నగర్, మద్దూరు తదితర గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సోమవారం ఎంపీఓ ఆంజనేయరెడ్డి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంపీఓ మాట్లాడుతూ పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

అయిజ: పట్టణ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం పక్కన నూతనంగా నిర్మించిన శివాలయంలో మంగళవారం నుంచి దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మూడురోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గ్లాసుల పంపిణీ

అలంపూర్ రూరల్: మండలంలోని ఊట్కూర్ పాఠశాలలో సోమవారం గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తమ తండ్రి శాంతారెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థులకు స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేష్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్ ఆరంజ్యోతి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మల్దకల్: సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ స్వరూపారాణి సూచించారు. మండల కేంద్రంలో సోమవారం ఇంటింటి సర్వేను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ ముందుజాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



గట్టు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు అయిజ సబ్‌డివిజన్ ఆపరేషన్ ఏడీఈ గోవిందు, టీఆర్‌ఈ ఏడీఈ నాగరాజు, ఏఈలు చెన్నయ్య, నాగరాజు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మార్పు కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ లోఓల్టేజీ సమస్య నుంచి రైతులకు కొంత ఉపశమనం లభిస్తుంది. కార్యక్రమంలో లైన్‌మెన్ మునిస్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధరూరు: మండలంలోని మార్లబీడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు సందర్భంగా కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ రమేష్‌బాబు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని బూరెడ్డిపల్లి, ఓబులోనిపల్లి, మార్లబీడు, ర్యాలంపాడు, చెన్నారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అధిక లోడ్ కారణంగా సబ్‌స్టేషన్ ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు కెపాసిటీని పెంచేందుకు మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హనుమప్పనాయుడు పోరాటం మరువలేనిది



ఎర్రవల్లిచౌరస్తా: దక్కన్ తెలంగాణ యుద్ధవీరుడు సర్దార్ హనుమప్పనాయుడు పోరాటం మరువలేనిదని మాజీ ఎమ్మెల్యే భరతసింహారెడ్డి అన్నారు. ఇటిక్యాల మండలంలోని బొచ్చు వెంగన్నపల్లిలో సోమవారం వాల్మీకి బోయల ఆధ్వర్యంలో సర్దార్ హనుమప్పనాయుడు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయల వీరత్వం, తెగింపు, ధీరత్వానికి మూలపురుషుడు హనుమప్పనాయుడు అని కొనియాడారు. ఆయన పోరాట పటిమను గుర్తించిన ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో చేర్చడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడిచి ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధునాయుడు, ఉపసర్పంచ్ మునిగౌడ్, ఆర్‌పీ శేషు, శ్రీధర్‌రెడ్డి, సంజీవనాయుడు, సైనాథరెడ్డి, వెంగళనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



కేటీదొడ్డి: అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఎంపీపీ మనోరమ, తహసీల్దార్ సరితారాణితో కలిసి 113మందికి కల్యాణలక్ష్మి, 17మందికి బీసీబంధు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి పథకం అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో చక్రధర్, వెంకటేష్‌నాయుడు, డీటీ శివశంకర్, ఆర్‌ఐ ఉదయ్‌కిరణ్, సర్పంచులు తిక్కన్న, ఆంజనేయులు, గోపాల్, రాజు, సక్రూనాయక్, సత్యన్న పాల్గొన్నారు.

ధర్నాకు మద్దతిచ్చి సహకరించండి



అలంపూర్: సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నాకు మద్దతు ఇచ్చి సహకరించాలని కోరుతూ సోమవారం ఎంఈఓ అశోక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 29న జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం నుంచి కృష్ణవేణి చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా కలెక్టరేట్ వరకు శాంతి ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 30న కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఉద్యోగుల నిరసన కార్యక్రమాలకు సహకరించాలని ఎంఈఓను కోరారు. కార్యక్రమంలో రమాదేవి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, బాబు, ఈదన్న, వేణు, బాబు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పట్టింపేది?



ఉండవెల్లి: రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. మండలంలోని తక్కశీలలో సోమవారం పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలాలకు వెళ్లేందుకు సరైన దారి లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారంపై పాలకులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. కార్యక్రమంలో బలరాముడు, శంకర్‌గౌడ్, సూర్యగౌడ్, సీతారాంరెడ్డి, బాలన్న, నర్సన్‌గౌడ్, శోభన్‌గౌడ్, శంకర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, రవి, శరత్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

అయిజ: సెప్టెంబర్ 6న మండల కేంద్రంలో నిర్వహించనున్న బహుజన దివ్యాంగుల భరోసా సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం బీఎస్పీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా బీఎస్పీ మండల ఇన్‌చార్జ్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ బహుజన దివ్యాంగుల భరోసా సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుగౌడ్, అధ్యక్షుడు రాజు, హనుమన్న, పట్టణ అధ్యక్షుడు మహేష్, చిన్నా, శశివర్మ, యేసోపు, ఆనందరాజు, రాజు, ఉరుకుందు, నరేష్ పాల్గొన్నారు.

రక్తదానంతో స్నేహితుడికి నివాళి



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరుకు చెందిన బోయ రమేష్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం గ్రామంలో నిర్వహించిన అతడి దశదిన కార్యక్రమంలో ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు 60మంది రక్తదానం చేసి నివాళులర్పించారు. రక్తదానం చేసిన యువకులను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

వాల్మీకి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



గట్టు: మండలంలోని గంగిమాన్‌దొడ్డిలో వాల్మీకి ఆలయ నిర్మాణానికి సోమవారం ఆ సంఘం నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బల్గెర హన్మంతునాయుడు, ఎంపీటీసీ కృష్ణ, ఉపసర్పంచ్ హన్మంతు, కిష్టప్ప, రామునాయుడు, వెంకటన్న, నర్సింహులు, తిమ్మప్ప, కృష్ణ, కర్రెప్ప, సామేలు, రాజగోపాల్ పాల్గొన్నారు.

తెలుగుజాతికి గర్వకారణం

శాంతినగర్: దివంగత నందమూరి తారక రామారావు చిత్రంతో రూ.వంద నాణెం విడుదల చేయడం తెలుగుజాతికి గర్వకారణమని టీడీపీ నాయకులు అన్నారు. వడ్డేపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రపతి చేతులమీదుగా రూ.వంద నాణెం విడుదల చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. సమావేశంలో గజేంద్రగౌడ్, పూర్ణచందర్‌రావు, భాస్కర్‌రావు, రాములు ఉన్నారు.

'రాష్ట్రంలో నియంత పాలన'

కేటీదొడ్డి: రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. మండలంలోని మల్లాపురంలో సోమవారం 'తిరగబడుదాం.. తరిమికొడుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటస్వామి, గట్టు కృష్ణ, ఉపసర్పంచ్ కంబయ్య, మహబూబ్, కృష్ణారెడ్డి, తిరుమలేష్ పాల్గొన్నారు.

రైతులతో బ్యాంకుల కిటకిట

గట్టు: ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేసిన నేపథ్యంలో రైతులు బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. సోమవారం వివిధ గ్రామాలకు చెందిన రైతులతో మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కిటకిటలాడింది. రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేసేందుకుగానూ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేసింది. దీంతో బ్యాంకర్లు పంట రుణాలను రెన్యూవల్ చేయడంతోపాటు మాఫీ డబ్బులను కొంతమేరకు రైతులకు ఇస్తుండడంతో బ్యాంకులకు క్యూ కడుతున్నారు. మాచర్ల బ్యాంక్‌తోపాటు సింధనూర్ బ్యాంక్‌కు రైతులు భారీగా తరలివస్తున్నారు. ఇదిలా ఉండగా.. బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకొని రెన్యూవల్ చేయకుండా మొండి బకాయిలుగా మారిన రైతుల ఖాతాలను బ్యాంకర్లు ఫ్రీజ్ చేశారు. దీంతో రుణమాఫీ డబ్బులు జమ కాలేదు. అలాంటి రైతులు బ్యాంకులకు వచ్చి, ఖాతా వివరాలను తెలుసుకుంటున్నారు. రుణమాఫీ జాబితాను ప్రకటిస్తామని బ్యాంకు అధికారులు చెబుతున్నప్పటికీ.. ఎప్పుడు ప్రకటిస్తారనే దానిపై స్పష్టత లేకపోవడంతో రైతులు తికమకపడుతున్నారు.

అబ్రహం అభ్యర్థిత్వానికి సహకరించం

- వడ్డేపల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలో అబ్రహం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఆయనకు బీ–ఫారం కేటాయిస్తే సహకరించేది లేదని వడ్డేపల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు ప్రకటించారు. శాంతినగర్‌లో సమావేశం పలు మండలాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్రహం తీరుతో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందన్నారు. అంతేగాక పార్టీ కోసం, అబ్రహం గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలను విస్మరించారన్నారు. కమీషన్ కోసం పనిచేస్తుండటంతో బీఆర్‌ఎస్ పార్టీకి, సీఎం కేసీఆర్‌పై ప్రజల్లో వ్యతిరేకత వస్తుందన్నారు. అంతేకాకుండా అబ్రహం కుమారుడు చేస్తున్న ఇసుక, మట్టి దందా, అక్రమ ఆస్తులు కూడబెట్టడమేగాక రౌడీ రాజకీయం చేస్తున్నారన్నారు. అబ్రహంకు టికెట్ కేటాయిస్తే పార్టీకి నష్టం వాటిల్లుతుందన్నారు. అబ్రహంకు కాకుండా వేరే వ్యక్తికి టికెట్ కేటాయిస్తే సంపూర్ణ మద్దతు ప్రకటించి బీఆర్‌ఎస్ పార్టీ విజయానికి అహర్నిషలు శ్రమిస్తూ.. పార్టీపై అంకిత భావంతో పనిచేసి గెలుపుకు కృషిచేస్తామన్నారు. సమావేశంలో జోగుళాంబ ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య, వడ్డేపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, ధర్మకర్త వెంకటేష్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ కల్పన, మధుసూదన్‌రెడ్డి, రవిప్రకాష్ తదితరులు ఉన్నారు.

ఆర్డీఎస్‌పై రాజకీయం చేయొద్దు


మాట్లాడుతున్న సీతారామిరెడ్డి

శాంతినగర్: ఆర్డీఎస్‌పై రాజకీయాలు చేయడం తగదని ఆర్డీఎస్ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డి అన్నారు. మండలంలోని తనగలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీబీ డ్యాంలో పూర్తిస్థాయి నీటినిల్వలు లేనందున ఆర్డీఎస్ కెనాల్, తుంగభద్ర నదికి నీటిని విడుదల చేసే పరిస్థితి లేదన్నారు. అది తెలుసుకోకుండా ఆర్డీఎస్ కెనాల్‌లో కూర్చొని ధర్నాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కర్ణాటక పరిధిలో వర్షాభావ పరిస్థితుల వల్ల టీబీ డ్యాంలో ప్రస్తుతం 79 టీఎంసీలు మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయన్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 105 టీఎంసీలకు చేరితేనే దిగువకు నీటిని విడుదల చేస్తారన్నారు. డ్యాంలో 80శాతం నీళ్లుంటే ఎల్‌ఎల్‌సీలకు, బళ్లారి కాల్వ, మరికొన్ని కెనాళ్లకు మాత్రమే నీటిని వాడుకోడానికి హక్కు ఉంటుందన్నారు. ఆర్డీఎస్ కెనాల్‌కు అక్టోబర్‌లోనే ఇండెంట్ పెట్టే హక్కు ఉందన్నారు. తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం ఉంటే తుమ్మిళ్ల ద్వారా నీటిని వాడుకోడానికి అవకాశం ఉండేదన్నారు. తుంగభద్ర నదిలో అసలే నీళ్ల లేవు.. తుమ్మిళ్ల లిఫ్ట్ ఎలా ఆన్ చేస్తారని ప్రశ్నించారు. ఎగువన ఉన్న అగ్రి తదితర ఉపనదులకు ఇంతటి క్లిష్ట పరిస్థితి ఏనాడూ రాలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్డీఎస్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని రైతులను రెచ్చగొట్టడం సరికాదన్నారు. శివమొగ్గ, భద్రావతి జిల్లాల్లో వర్షాలు లేకపోవడంతో నీటి నిల్వలు లేవన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గాజులదిన్నె వద్ద కూడా 1.5 టీఎంసీలు కూడా లేవన్నారు. ఈ సమయంలో లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండాలని, ప్రస్తుతం 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో లేదన్నారు. సీఎం కేసీఆర్ సప్లమెంటరీ విధానాన్ని ప్రవేశపెట్టి ఎత్తిపోతల పథకాల ద్వారా మాత్రమే రైతులకు న్యాయం చేస్తున్నారన్నారు. సుమారు 65ఏళ్లు కాంగ్రెస్ పార్టీ దేశాన్ని పాలించినా ఎప్పుడూ పూర్తిస్థాయిలో నీరందించలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతంలోనే టీబీ డ్యాం ఉందన్న విషయాన్ని మర్చిపోయి మాట్లాడుతున్నారని ఎద్దేవ చేశారు. స్వార్థ రాజకీయాలకోసం రైతులను రెచ్చగొట్టరాదని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

సెకండ్ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి


మానవహారం నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు

గద్వాల అర్బన్: సెకండ్ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఏఎన్‌ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారంతో 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు కొన్ని రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రంగన్న, ఆశన్న, వెంకట్రాములు, సరస్వతి పాల్గొన్నారు.

ఖర్గే చిత్రపటానికి పాలాభిషేకం


అలంపూర్‌లో మల్లికార్జున ఖర్గే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అలంపూర్: పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన చేవెళ్ల సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించడం హర్షణీయమన్నారు. ఎస్సీలకు 18, ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్లు పెంచుతామని, అంబేద్కర్ అభయహస్తంలో ఎస్సీలకు రూ.12లక్షల ఆర్థికసాయం, ఇందిరమ్మ పథకంతో ఇండ్లు లేని పేదలకు ఇంటి స్థలంతోపాటు రూ.6లక్షల సాయం అందిస్తామని ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బుచ్చన్న, ఎల్లన్న, రామకృష్ణ, నర్సింహ, శంకర్, భాస్కర్ పాల్గొన్నారు.

అయిజ: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించిన సందర్భంగా పట్టణంలో అంబేద్కర్ విగ్రహం, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చిత్రపటానికి పార్టీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. దేవరాజు, హనుమన్న, సాంబశివుడు, సుధాకర్, ముక్కెరన్న, సులోచనమ్మ పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాగేష్, రమేష్, నర్సన్‌గౌడ్, నయీం, మద్దిలేటి, గోపాల్ పాల్గొన్నారు.